పెద్దమ్మ జాతరకు ఆహ్వానం


కంఠారెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆలయ కమిటీ

రామాయంపేట, మే 6: ఈనెల 12, 13వ తేదీల్లో జరగనున్న పెద్దమ్మ, పెద్దిరాజుల కల్యాణానికి రావాల్సిందిగా బీఆర్ఎస్ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డికి ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికను అందజేశారు. మంగళవారం పురపాలిక పరిధిలోని గొల్పర్తి గ్రామ పెద్దమ్మ కమిటీ సభ్యులు హైదరాబాద్‌లోని కంఠారెడ్డి తిరుపతిరెడ్డి స్వగృహానికి వెళ్లి ఆహ్వాన పత్రికను అందజేసి ఉత్సవాలకు ఆహ్వానం పలికారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చేగుంట, మే 6: చేగుంట మండలం పోతన్‌శెట్టిపల్లికి చెందిన దొంతి రాణికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును బీఆర్ఎస్ చేగుంట మండల అధ్యక్షుడు కోమండ్ల నారాయణరెడ్డి అందజేశారు. మండల పరిధిలోని పోతన్‌శెట్టిపల్లి గ్రామానికి చెందిన దొంతిరాణి అనారోగ్యంతో దవాఖానలో చికిత్స పొందగా, వైద్య ఖర్చుల కోసం దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి సహకారంతో మంజూరైన రూ.60వేల చెక్కును మంగళవారం బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో నారాయణరెడ్డితో పాటు, రైతుబంధు సమితి జిల్లా మాజీ డైరెక్టర్ చేర్యాల మోహన్‌రెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ నెల్లూర్ తదితరులున్నారు.

శివ్వంపేటలో...

శివ్వంపేట, మే 6: శివ్వంపేట మండలం దొంతి గ్రామానికి చెందిన పూలగారి వెంకటేశానికి ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి చొరవతో మంజూరైన రూ.60వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును మంగళవారం బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు చిగుళ్లపల్లి శ్రీనివాస్ గుప్తా, మాజీ కోఆప్షన్ సభ్యుడు లాయక్, మాజీ ఎంపీటీసీ లక్ష్మీకుమార్ బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో బాబు, ముత్యాలు, సత్యనారాయణ, రాహుల్, నరేందర్, కృష్ణ, హరి, శ్రీకాంత్‌రెడ్డి, దశరథ, వెంకటేశ్, రాములు, వెంకటేశ్, రాము, శ్రీనివాస్, విఠల్, సుధాకర్, శ్రీనివాస్ ఉన్నారు.

తూకం వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి

రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో

వెల్దుర్తి, మే 6: కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని అలస్యం చేయకుండా తూకం వేసి రైస్‌మిల్లులకు తరలించాలని తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని హస్తాల్‌పూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. కొనుగోలు కేంద్రం వద్ద ఉన్న రైతులతో ఆర్డీవో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. రైతులు కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చే ధాన్యాన్ని తప్పకుండా జల్లెడ పట్టి తీసుకురావాలన్నారు. రైతులకు ఇబ్బందులు కాకుండా తూకం వేయాలన్నారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ బాలలక్ష్మి, వ్యవసాయ శాఖ ఏవో ఝాన్సీ, ఆర్ఐ నర్సింగ్ యాదవ్, రైతులు పాల్గొన్నారు.

విత్తన కొనుగోలులో జాగ్రత్త వహించాలి

రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్త పద్మశ్రీ గీత

నర్సాపూర్, మే 6: విత్తన కొనుగోలులో రైతులు జాగ్రత్త వహించాలని శాస్త్రవేత్త పద్మశ్రీ గీత సూచించారు. మంగళవారం మండల పరిధిలోని మహ్మదాబాద్, కొండాపూర్‌లో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు-అన్నదాతలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏవో దీపిక, శాస్త్రవేత్తలు రంజిత, గాయత్రి, ఏఈవో లక్ష్మీ, రైతులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

వెల్దుర్తి, మే 6: రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం అకాల వర్షానికి తడిసిపోయి ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి గౌరి అన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం వ్యవసాయ శాఖ ఏఈవో వందనకు సీపీఎం మండల కమిటీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల వద్ద లారీల సాకుతో ధాన్యం బస్తాకు రూపాయి చొప్పున అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో కొనుగోలు కేంద్రాలు త్వరగా ప్రారంభమయ్యాయని, ప్రస్తుతం కొనుగోలు కేంద్రాలు ఆలస్యంగా ప్రారంభించి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. రైతులు పడుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని, లేకపోతే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు.

కోర్టు ఏర్పాటుకు భవనం పరిశీలన

అధికారులతో మాట్లాడుతున్న డీఆర్‌వో భుజంగరావు

తూప్రాన్, మే 6: తూప్రాన్ పట్టణానికి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మంజూరై మూడు సంవత్సరాలవుతుంది. కోర్టు కార్యకలాపాలు ప్రారంభించడానికి నిధులు సైతం మంజూరయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం కొనసాగుతున్న మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని నూతన కోర్టు తాత్కాలిక భవనంగా కొనసాగించేందుకు అధికారులు ప్రతిపాదించగా, ఈనెల 3న జిల్లా న్యాయమూర్తి నీలిమ సందర్శించారు. ఈ నేపథ్యంలో వీలైనంత త్వరగా కోర్టు కార్యకలాపాలు ప్రారంభించేందుకు భవన పరిశీలన కోసం తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డితో కలిసి జిల్లా రెవెన్యూ అధికారి భుజంగరావు ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించారు. ఆయన వెంట ఎంపీడీవో శేషాద్రి, తహసీల్దార్ శ్రీనివాస్, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

రామాయంపేట, మే 6: పట్టణంలో సీఐ వెంకటరాజ గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. మంగళవారం పట్టణంలోని పలు వీధుల గుండా ర్యాపిడ్ యాక్షన్ ఫోర్సుతో పాటు పట్టణ పోలీసులు తుపాకీలు చేతపట్టి తిరిగారు. ఎస్సీ ఉదయ్ కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు పోలీస్, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్సుతో పెద్దఎత్తున వీధుల గుండా తిరిగారు. శాంతి భద్రతల పరిరక్షణకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు సీఐ తెలిపారు.

అ'పూర్వ' సమ్మేళనం

జిన్నారం, మే 6: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2002-03 సంవత్సరం పదో తరగతి పూర్వ విద్యార్థులు అపూర్వ సమ్మేళనాన్ని స్థానిక ఎన్ఆర్ఎస్ గార్డెన్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన గురువులను పూర్వ విద్యార్థులు శాలువాలు కప్పి సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. 22 ఏండ్ల తర్వాత పాతమిత్రులు ఒకే చోట కలుసుకొని, నాటి జ్ఞాపకాలను నెమరు వేస్తూ జీవితంలో స్థిరపడిన క్షణాలను పరస్పరం పంచుకున్నారు. దాదాపు 100 మంది పూర్వ విద్యార్థులు సమ్మేళనానికి హాజరయ్యారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటరాములు, వజిమొద్దీన్, కృష్ణారెడ్డి, అనంతరెడ్డి, దశరథరామ శర్మ, యాదగిరి, భిక్షపతి, పెంచలయ్య, సంజీవరెడ్డి, శివకుమారి, యమున, భాస్కర్ ఉన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు

- కలెక్టర్ రాహుల్ రాజ్

బండపోతుగల్‌లో రైతులు అందజేసిన దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్ రెడ్డి

చిలిపిచెడ్, మే 6: భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేశామని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మెదక్ జిల్లాలోని భూ భారతి చట్టం పైలట్ ప్రాజెక్టు కింద ఎన్నికైన చిలిపిచెడ్ మండలంలోని అన్ని గ్రామాల్లో ఈనెల 14వ తేదీ వరకు రైతులకు భూసమస్యలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. మంగళవారం మండలంలోని బండపోతుగల్, లింగరావుగూడ రెవెన్యూ గ్రామాల్లో రెండు టీంలతో రైతు సమస్యలు పరిష్కరిస్తున్నారు. ఈ గ్రామాల్లో రెవెన్యూ సదస్సును కలెక్టర్ రాహుల్ రాజ్, నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రైతుల భూసమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం నూతనంగా భూభారతి చట్టాన్ని అమలు చేసిందన్నారు. చిలిపిచెడ్ మండలంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు అందజేసిన దరఖాస్తులను వెంటవెంటనే పరిశీలిస్తూ సత్వర పరిష్కారానికి వీలుగా ఉన్న వాటిని తహసీల్దార్ దృష్టికి తెచ్చి అప్పటికప్పుడు పరిష్కారం జరిగేలా చూడాలన్నారు. పైలట్ మండలంలో సదస్సులు పూర్తయ్యాక, జిల్లాలోని అన్ని మండలాల్లో రెవెన్యూ గ్రామాల వారీగా భూభారతి రైతు సదస్సులు నిర్వహిస్తామన్నారు. నియోజకర్గంలోని నర్సాపూర్, శివ్వంపేట, కొల్చారం, కౌడిపల్లి తహసీల్దార్లు వచ్చి భూభారతి చట్టం అవగాహన సదస్సును పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు సహాదేమ్, ఆంజనేయులు, డిప్యూటీ తహసీల్దార్ సింధూజ, షఫీ, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు

చిలిపిచెడ్, మే 6: పేదలందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తుందని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మంగళవారం మండలంలోని చిట్కుల్‌లో ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇల్లు లేని నిరుపేదలు ఇల్లు కట్టుకోవడానికి ప్రభుత్వం సాయం చేస్తుందన్నారు. మండలంలో ఇల్లు మంజూరైన లబ్ధిదారులకు ఇల్లు అందేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోకు ఆదేశాలు ఇచ్చారు. ఎప్పటికప్పుడు మండలంలో పర్యవేక్షించి లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామంలో తాగునీటి సమస్య గురించి కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. మరమ్మతులకు నోచుకున్న సింగల్‌ఫేజ్ మోటర్‌ను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆనంద్, ఇన్‌చార్జి ఎంపీవో తిరుపతి, ఆయా గ్రామాల కార్యదర్శులు అశోక్, జితేందర్ ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన

మనోహరాబాద్, మే 6: మనోహరాబాద్ మండలం దండుపల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ రాహుల్‌రాజ్ మంగళవారం ఆకస్మికంగా పరిశీలించారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోలు చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో జయచంద్రారెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మెట్టు బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత


చెక్కు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చిలిపిచెడ్, మే 6: నర్సాపూర్ నియోజకవర్గ ప్రజల కోసం ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని బీఆర్ఎస్ నాయకుడు నర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం ఫైజాబాద్ గ్రామానికి చెందిన ఎర్రోళ్ల భూమయ్యకు రూ.42వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జనార్దన్, కిరణ్, గ్రామస్తులు ఉన్నారు.

పాలన చేతగాని సీఎంతో ఆర్థిక సంక్షోభం

- బీఆర్ఎస్ పట్టణ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు

మెదక్ మున్సిపాలిటీ, మే 6: పాలన చేతగాని ముఖ్యమంత్రితో రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుందని బీఆర్ఎస్ మెదక్ పట్టణ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రం దివాలా తీసింది, ఎక్కడా నయాపైసా పుట్టడం లేదని మాట్లాడటం సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. పదేండ్లలో తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్ వన్‌గా కేసీఆర్ నిలిపితే, రేవంత్‌రెడ్డి తెలంగాణ పరువు పోయేలా మాట్లాడటం ఏమిటని ప్రశ్నించారు. పాలన చేతగాకపోతే ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీల మేరకు ఉద్యోగస్తులు పీఆర్సీ, డీఏలు అడిగితే, వారిని విలన్లుగా చిత్రీకరించి మాట్లాడటం సీఎంకు తగదన్నారు. దేశంలో ఏ సీఎం రేవంత్‌రెడ్డిలా మాట్లాడటం లేదన్నారు. రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉందని సీఎం చేతులెత్తేయడం దారుణమన్నారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో నోట్ల రద్దు, రెండేండ్లు కరోనాతో నయాపైసా పుట్టని అత్యంత ప్రమాదకరమైన పరిస్థితుల్లో సంపదను సృష్టించి రాష్ట్రాన్ని దేశంలోనే ఉన్నతస్థాయిలో నడిపారన్నారు. సంపదను సృష్టిస్తాం.. ప్రజలకు పంచుతాం.. కేసీఆర్ కంటే గొప్ప పాలన అందిస్తామని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని రేవంత్‌రెడ్డి ఒప్పుకున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు గడిచినా ఇచ్చిన హామీలను నెరవేర్చకపోయిందన్నారు. స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికలు నిర్వహించక పోవడం రేవంత్‌రెడ్డికే చెల్లిందన్నారు. రేవంత్‌రెడ్డి పాలనలో రాష్ట్రం మరో పదేండ్లు వెనక్కి వెళ్లడం ఖాయమన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేసుకోవాలి

లింగంపల్లిలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేస్తున్న వ్యవసాయాధికారి జావీద్

రేగోడ్, మే 6: రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేసుకోవాలని ఏవో జావిద్ తెలిపారు. ప్రతిఒక్కరికీ ఆధార్ నెంబర్ ఏవిధంగా ఇచ్చారో, అదేవిధంగా ప్రతి రైతుకూ 14 అంకెలతో విశిష్ట సంఖ్య ఇస్తారని చెప్పారు. ప్రభుత్వ పథకాల అమలు సమర్థవంతంగా అమలయ్యేందుకు ఈ విశిష్ట గుర్తింపు సంఖ్యను ఇవ్వడానికి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఆధార్, పాస్‌బుక్, ఆధార్ లింక్ చేయబడిన మొబైల్ నెంబరు తీసుకొని సమీపంలోని వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మండలంలోని గజవాడ, టి.లింగంపల్లి, ఆర్ఇటిక్యాల్ గ్రామాల్లో ఫార్మర్ రిజిస్ట్రేషన్ క్యాంపు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఈవో, రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

వడియారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఆర్వో భుజంగరావు

చేగుంట, మే 6: ధాన్యం కొనుగోళ్లను వేగవంతంగా పూర్తి చేయాలని మెదక్ డీఆర్వో భుజంగరావు పేర్కొన్నారు. చేగుంట మండల పరిధిలోని వడియారంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలోని రిజిస్టర్లు, పంట సేకరణ విధానం, నాణ్యత పరీక్షలు, చెల్లింపు ప్రక్రియను పరిశీలించారు. ట్యాబ్‌లో నమోదు చేసి రైతులకు సకాలంలో ధాన్యం డబ్బులు అందేలా కృషి చేయాలని నిర్వాహకులను డీఆర్వో భుజంగరావు ఆదేశించారు. అకాల వర్షం వల్ల ధాన్యం తడువకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు. కార్యకమంలో జిల్లా డీపీఆర్వో, తహసీల్దార్ శ్రీకాంత్, ఏపీఎం లక్ష్మీనర్సమ్మ, ఆర్ఐ జయభారత్‌రెడ్డి, సంతోశ్ రావు, ఐకేపీ రామస్వామి, పలువురు రైతులు ఉన్నారు.

సత్యసాయి ఆలయంలో ఆరాధనోత్సవాలు

రామాయంపేట, మే 6: ఈశ్వరమ్మ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని సత్యసాయి సేవా మందిరంలో ఆరాధన ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మంగళవార సత్యసాయి సేవా సమితి అధ్యక్షుడు యాచం శంకరయ్య గుప్తా ఆధ్వర్యంలో సత్యసాయి ఆలయంలో తెల్లవారుజామునే ఈశ్వరమ్మకు ఓంకారం, సుప్రభాతసేవ, అభిషేకం, అష్టోత్తర సేవా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం రామాయంపేట బస్టాండులో ప్రయాణికులకు అన్నదానంతోపాటు ఝాన్సీలింగాపూర్‌లోని ఎముకల దవాఖానలో రోగులకు పండ్లు, బ్రెడ్లు అందజేశారు. కార్యక్రమంలో మహిళా కోఆర్డినేటర్ భూలక్ష్మి, స్నేహిత యూత్ కోఆర్డినేటర్ గౌరీశంకర్, భానుశేఖర్, యాదగిరి, బల్ల రాజయ్య ఉన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

తూప్రాన్, మే 6: తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డులో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని, సమస్యను పరిష్కరించాలని కోరుతూ 11వ వార్డు పడాలపల్లి ప్రజలు మంగళవారం తూప్రాన్ మున్సిపల్ కమిషనర్ గణేశ్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో రెండు పూటలా నీరు వచ్చేదని, ఇప్పుడు ఉదయం పూట మాత్రమే వస్తుందన్నారు. ఆ వచ్చే నీరు కూడా సరిగా రావడం లేదని, దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఊర చెరువు దగ్గరలో ఉన్న బోరుబావిలో మోటరు ఏర్పాటు చేసి పెద్ద వాటర్ ట్యాంకులు నింపాలన్నారు. గాంధీ విగ్రహం మోటరు బావి నుంచి కొత్త రూమ్ల వైపు ఒక పైపులైను, ఎల్లమ్మ గుడివైపు మరో పైప్‌లైను వేసి వాల్స్ ఏర్పాటు చేసి నీటి సమస్యను పరిష్కరించాలన్నారు.

రైతులకు సబ్సిడీ టార్పాలిన్లు అందేనా..

చిట్కుల్‌లో అద్దెకు ఉంచిన టార్పాలిన్లు

చిలిపిచెడ్, మే 6: ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై టార్పాలిన్లు ఇవ్వడం లేదు. దీంతో రైతులు ఇబ్బందులు పడుతూ.. అద్దె టార్పాలిన్ల కోసం వేలు ఖర్చు పెడుతున్నారు. కోతల సమయంలో ధాన్యాన్ని ఆరబెట్టేందుకు, వర్షాల నుంచి కాపాడుకోవడానికి ఆవస్థలు పడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో రైతులు అద్దెకు టార్పాలిన్లు తెచ్చుకుంటున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 50శాతం సబ్సిడీపై ఎనిమిది ఫీట్ల పొడవు, ఆరు ఫీట్ల వెడల్పుతో మందం ఉన్న టార్పాలిన్లను వ్యవసాయ శాఖ తరపున రైతులకు సబ్సిడీపై అందజేసింది. ఇప్పుడు వాటి సరఫరా నిలిచిపోవడంతో రైతులు వేలు ఖర్చుచేసి అద్దెకు తీసుకుంటూ నష్టపోతున్నారు. అకాల వర్షాలతో టార్పాలిన్లు లేక కేంద్రాల్లో ధాన్యం తడిసి రైతులు తీవ్ర నష్టానికి గురవుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఆరబోసి, వాటిని కాంటా వేసే వరకు కనీసం 20 రోజుల సమయం పడుతుంది. ఏపీకి చెందిన వ్యాపారులు ఇక్కడ టార్పాలిన్లు అద్దెకు ఇస్తూ లాభాలు గడిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సబ్సిడీపై టార్పాలిన్లు అందజేయాలని రైతులు కోరుతున్నారు.

ఆరోగ్య సిబ్బంది గ్రామాల బాటపట్టాలి

మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి శ్రీరాం

రామాయంపేట, మే 6: ఆరోగ్య సిబ్బంది సెలవులకు స్వస్థిచెప్పి, గ్రామాల బాటపట్టాలని జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ పేర్కొన్నారు. మంగళవారం రామాయంపేట మండలం డి.ధర్మారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆరోగ్య సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. పీహెచ్‌సీ పరిధిలో పనిచేస్తున్న సిబ్బంది ప్రతిరోజూ డ్యూటీలకు రావాలని, అత్యవసర పనులు ఉంటేనే సెలవులు పెట్టాలని సూచించారు. ఎండాకాలం దృష్ట్యా ప్రజలకు సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం ఉందని, ఏఎన్ఎంలు నిత్యం గ్రామాలకు వెళ్లి ప్రజలకు అవసరమైన మాత్రలు ఇవ్వాలన్నారు. గ్రామాల్లో డెలివరీలకు ఉన్న వారిని గుర్తించి ప్రభుత్వ దవాఖానలోనే ప్రసవించేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ దవాఖానలోనైతే అన్ని వసతులు, వైద్యుల పర్యవేక్షణలో చికిత్సలు ఉంటాయని చెప్పాలన్నారు. ఎక్కువశాతం ప్రభుత్వ దవాఖానలో నార్మల్ డెలివరీలకే ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అనంతరం వైద్యాధికారి దవాఖాన పరిసరాలను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. వైద్యాధికారి వెంట ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హరిప్రాద్, పీహెచ్‌సీ వైద్యురాలు హరిప్రియ, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి

విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి రాధాకిషన్

రామాయంపేట, మే 6: విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీయాలని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ అన్నారు. మంగళవారం రామాయంపేటలో జరుగుతున్న సమ్మర్ క్యాంపును ఆకస్మికంగా సందర్శించి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలిచ్చారు. ప్రతి విద్యార్థి సమ్మర్ క్యాంపులో తమలో దాగిఉన్న ఆలోచనలను బయటకు తీసుకురావాలన్నారు. శిబిరాల్లో ఆటలు, పాటలు, యోగా, చిత్రలేఖనం నేర్పించాలన్నారు. ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి 11గంటల వరకు విద్యార్థులు హాజరుకావాలన్నారు. జిల్లావ్యాప్తంగా 21 మండలాల్లో శిబిరాలు కొనసాగుతున్నాయన్నారు. రామాయంపేటలో జరుగుతున్న సమ్మర్ క్యాంపునకు 100 మంది విద్యార్థులకు పైగా హాజరు కావడం సంతోషంగా ఉందన్నారు. ఇందుకు అహర్నిషలు కష్టపడుతున్న విద్యాధికారి, హెచ్ఎంలను జిల్లా విద్యాధికారి అభినందించారు. కార్యక్రమంలో రామాయంపేట ఎంఈవో అయిత శ్రీనివాస్, హెచ్ఎం నాగమణి, ఉపాధ్యాయులు మల్లేశం, కవిత, యోగా మాస్టర్ మద్దెల భరత్, డ్రాయింగ్ టీచర్ యాదమ్మ ఉన్నారు.

శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

చేగుంట, మే 6: సమ్మర్ క్యాంపును ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ పేర్కొన్నారు. చేగుంటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న యంగ్ ఇండియా సమ్మర్ క్యాంపును విద్యాధికారి రాధాకిషన్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి కంప్యూటర్, యోగా, కుట్లు, అల్లికలు, ఆటలపై శిక్షణ ఇస్తున్నట్లు డీఈవో తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చల్లా లక్ష్మణ్, రావుల వెంకటేశ్, స్వామి, నందు, సుమతి, మంజులత, రేఖ, సంధ్య, సమ్మర్ క్యాంప్ శిక్షకులు కరణం శ్రీదేవి, గీత, రేణుక, వినోద తదితరులున్నారు.

క్రిప్టో కరెన్సీ పేరుతో కుచ్చుటోపీ

రూ.50 వేలు పోగొట్టుకున్న బాధితుడు

- ఇతడితోపాటు సుమారు 60 మంది బాధితులు

నర్సాపూర్, మే 6: క్రిప్టో కరెన్సీలో పెట్టుబడి పెడితే డబ్బు రెట్టింపు అవుతుందని నమ్మించి తన వద్ద రూ.50 వేలు తీసుకొని ఆన్‌లైన్ చేసి మోసం చేశారని మండలపరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన కొల్చెల్మ ప్రకాశ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10 నెలల క్రితం ఏజెంట్లు దొంతి శ్రీనివాస్, కరుణాకర్‌రెడ్డి బిట్ కాయిన్‌లో పెట్టుబడి పెడితే డబ్బులు రెట్టింపు అవుతాయని నమ్మబలికి తన వద్ద రూ.50 వేలు తీసుకొని ఆన్‌లైన్ చేశారన్నాడు. దీనివల్ల రోజుకు సుమారు రూ.360 చొప్పున నెలకు రూ.9000లకుపైగా వస్తాయని చెప్పారని వెల్లడించారు. కానీ ఒక నెల మాత్రమే డబ్బులు పొందానని, ప్రస్తుతం ఆ డబ్బులు రాకపోగా వారు నిర్వహిస్తున్న యాప్ కూడా పనిచేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశాడు. నాతోపాటు చుట్టుపక్కల గ్రామాలైన గొల్లపల్లి, లింగోజిగూడా, పిల్లుట్ల, కొత్తపేట్, తిమ్మాపూర్ గ్రామాల నుంచి 60 మందిని గోవాకు తీసుకెళ్లి అందరినీ మభ్యపెట్టి డబ్బులు పెట్టుబడి పెట్టించారన్నారు. మొదట్లో గోవా టూర్ ఉచితమని చెప్పి తీరా రూ.50 వేలు గోవా టూర్‌కు ఖర్చు అయ్యాయని మోసం చేశారన్నారు. ఈ విషయంపై ఏజెంట